# నేపథ్యంలో....

మనం గడిపే రోజువారీ జీవితానికి సంబంధం లేకుండా నేపథ్యంలో అనేక ధ్వనులు వినిపిస్తూ ఉంటాయి. ఇందులో కొన్ని ఒక క్రమం ప్రకారం కొన్ని నిర్ణీతసమయాల్లో వినిపిస్తాయి, మిగతావి. అనూహ్యాలు, అప్పటికప్పుడు వినిపించేవి మనకి యిష్టమున్నా లేకపోయినా గోల భరించాల్సిందే-ఎక్కడికి పారిపోయినా ఇవి తప్పవు. అంతర్ముఖులం అయితే తప్ప—

ప్రకృతిలో సంగీతం ఉంది. అయితే కొన్ని చప్పుళ్ళు మనకు గిట్టవు. పగలు ఒక రకం హోరు - రాత్రిళ్ళు శబ్దాలు మరొక రకం— ఇవన్నీ మనం గడిపే జీవితానికి బాక్‌గ్రవుండు మ్యూజిక్‌ని సప్లయి చేస్తాయి మన ఇష్టానిష్టాలతో ప్రమేయం లేకుండా.

అయితే వీటిని మనం ఎంత వరకు ఎంజాయి చేస్తున్నామంటే చెప్పటం కష్టం. మన జీవితంలో ఒక భాగంగా వుండిపోయిన వాటిని ఎంజాయ్ చేయటం ఏవిటి?

రాత్రిళ్ళు అలారం టైంపీసుగాని గోడ గడియారంకాని టిక్ టిక్ మని గుండెలమీద కొట్టి మాట్లాడినట్లు పలుకుతాయి. ఒకవేళ నిద్రపట్టక వంట్లో బాగులేకపోతే దాని చప్పుడు భరించరానంతగా మారిపోతుంది. నేనప్పుడప్పుడూ గడియారాన్ని బోర్లాపడుకోపెట్టి దానిమీదో దిండో తువ్వాలో పుస్తకమో కప్పుతూ వుంటాను.

పంపు సరిగా తిప్పకుండా వదిలేస్తే దానిలోంచి టప్ టప్‌మని కారే నీటి చప్పుళ్ళు కూడా దుర్భరాలే లేద్దామంటే బద్ధకం, మగతగా ఉంటుంది. ఆ చప్పుడు మరీ భయంకరంగా డిస్టర్బింగ్‌గా వుంటుంది.

ఇవిగాకుండా మెట్లమీద కాలిజోళ్ళ చప్పుళ్ళు వినిపిస్తాయి. వాటితోనె దగ్గులు దూరంగా మాట్లాడుకునే గొంతుకలు వినిపిస్తాయి.



సినిమాకు వెళ్ళి వచ్చేవాళ్ళు పెద్ద గొంతుకలతో సినిమా కబుర్లు చెప్పుకుంటూ వెళ్తారు.

రాత్రిపూట బావి గిలక కర్రు కర్రుమంటూ నూతిలోంచి పైకి బాల్చీని లాగుతూ వుంటుంది. బాల్చీ నూతిలోకి దూకుతున్నప్పుడు గట్టుని డీకొని చేసే ఓటిగోలకు నిద్రపడుతూ వడుతూ వున్న సమయంలో మెలకువ వచ్చేస్తూ వుంటుంది.

వుండీ వుడిగే రోడ్డుమీద పోయే మోటార్ సైకిల్ "ఫట్ ఫట్" మని చేసే ధ్వనికి మెదడు స్క్రూలు వదులవుతాయేమోనని భయం

వేస్తుంది. ఆ వీధిలోనో ఎక్కడో ఒక లారీ డ్రయివరున్నాడు. రాత్రి విధిగా పదకొండు పన్నెండున్నర గంటల మధ్య ఆ లారీ బడబడా చప్పుళ్ళు చేసుకుంటూ నిశ్శబ్దంగా నిద్రపోతున్న వీధిలోకి ప్రవేశించి చాలా సేపు అల్లరీ ఆగం చేస్తుంది. క్రింద వరండాలో పడుకుని పెద్ద పెట్టున గ్రురుపెట్టే ఇంటాయన గుర్రు ఒకప్పుడు తీవ్రస్థాయిలో ఒకప్పుడు మందంగానూ వినపడుతుంది. తరువాత హఠాత్తుగా ఒక కుక్క అరుస్తుంది. ఆ వెనువెంటనే అనేక కుక్కలు అరుపులకి లంకించుకుంటాయి. ఎంతకీ వదలవు. ఏ జ్వరంవచ్చో నిద్రపట్టక మంచంలో కూర్చుంటే యివన్నీ విధిగా విని తీరాల్సిందే. కార్లు సర్రున దూసుకుపోయిన చప్పుడు. వాటి హెడ్‌లైట్ల కాంతి మన గదిలోకి దూసుకువచ్చి స్లోగా నిష్క్రమించటాన్ని చూస్తూ పడుకోటం, ఇహ చుట్టుప్రక్కల ఎక్కడైనా పెళ్ళయితే రికార్డుల మ్యూజిక్ తగులుకుందన్నమాటే — మధ్యలో అపస్వరాలతో పాటలు పాడే ఔత్సాహిక గాయక గార్ధభాలు కొన్ని, ఈ మధ్యన ఒక్కొక్క మొగలో అరడజనుకు మించి రేడియోసెట్లు రాత్రి పదిన్నర వరకూ చెవి కోసిన మేకల్లాగా అరుస్తూనే వుంటాయికద! రేడియోలు మూసేశారంటే యిల్లు కొంత చల్లబడిందనుకోవాలి. అర్ధరాత్రి వేళ గేట్లు తీసిన కిర కిరకు—రోడ్డుమీద పోతూ భయంలేకుండా వుండేందుకు కుర్రాళ్ళు బిగ్గరగా పాడే పాటలు—యింకా ఓ రాత్రివేళ కృష్ణానది హోరు. రైలు స్టేషన్ దగ్గర ఇంజన్లూ వాటి రాకపోకల ధ్వనులు ఇవన్నీ వింటూ అటూ యిటూ వొత్తిగిల్తూ రాత్రి గడపాల్సిందే. కళ్ళు పొడారిపోతాయి. కడుపులోపలికి వెళ్ళిపోతుంది. కొబ్బరాకుల మధ్యనుంచి గదిలోకిపడే కాంతిని వెలుగు నీడలను, హెడ్‌లైట్ల వెల్తురునూ చూస్తూపడుకోవటం ఎప్పుడు తెల్లాతుందా అనివాపోతూ—

ఒంటిగంట దాటాక చౌకీదారు టక్‌టక్‌మని కర్రతో తలుపుల మీద కొడుతూ వస్తాడు—వాడి రాకను సహించలేనట్లు ఒక కుక్క బంయ్ మని అరుస్తుంది. మళ్ళీ చిన్న నిద్ర. అంతలోనే నీళ్ళకోసం మోటారు వేస్తారు. అది డుబ్ డుబ్ మని కొట్టుకోవటం ప్రారంభిస్తుంది. వాకిట్లోకి

లేచేవాళ్ళ తలుపు చప్పుళ్ళ, క్రింద ఇళ్ళలో చీపురు గరగరలతో సుప్రభాత మవుతున్నట్లు తెలుస్తుంది. కొందరిళ్ళలోంచి యిప్పుడిప్పుడు పాలుకాచే వేళ మిల్క్‌బాయిలర్ వేసే విజిల్సు వినిపిస్తుంటాయి. ఒక్కోరాత్రి ప్రత్యేక కార్యక్రమంలా ఎవరిదో దెబ్బలాటో, ఎవరింట్లోనో ఎవరో పోయిన శోకన్నాలో, పిల్లలు బిగ్గరగా చదువుతున్న చప్పుళ్ళో విని పిస్తాయి. మన జీవితం మనదేకాని. నేపథ్యంలో యిన్ని ధ్వనుల మధ్య మనం జీవిస్తూంటాము. దాన్ని సంగీతమన వచ్చో లేదో నాకు తెలియదు. మనచుట్టూ వున్న ప్రపంచంలోంచి మన కిష్టమైనవీ కానివీ ధ్వనులు మన ప్రమేయం లేకుండా పుట్టుకొస్తాయి. ప్రతి రాత్రీ అలకిస్తే కొత్త కొత్త ధ్వనులు వినిపిస్తాయి-రంజాన్ టైమ్‌లో తెల్లవారు ఝామున పాడుకుంటూ అదేదో తమాషాగా వాయించుకుంటూ నిద్ర లేవగొట్టేస్తూంటారు-అల్లాగే సంక్రాంతి టైములో బుడబుక్కలవాడు డక్కి కొడుతూ, గంగిరెద్దుల వాడూ వగైరా వగైరా అంతా వస్తారు. నేపథ్యం గురించి ఎవరికి వారే ఆలోచించుకున్న కొద్దీ ఎన్నెన్నో కొత్త సంగతులు పుడతాయి. పగటి పూట శబ్దాలు గురించి తెలిసిన వారెవరైనా రాయొచ్చు. చాలా తమాషాగా వుంటుంది రాస్తే—

●